క్లుప్తంగా

ఓటరు జాబితా ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్: మండల పరిధిలో త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల లిస్టు, పోలింగ్ స్టేషన్ల జాబితాను బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రఘుపతి రెడ్డి తెలిపారు.

మరిపెడ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమ్లనాయక్, ఏపీఓ బీమ్లానాయక్, కార్యదర్శులు లెనిల్, రామోజీ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధే లక్ష్యం

దంతాలపల్లి: గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తామని సీఎస్ఆర్ సభ్యురాలు రజితరెడ్డి అన్నారు. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన రజితరెడ్డి, తన భర్త కేశవరెడ్డితో కలిసి బుధవారం తన సొంత గ్రామాన్ని సందర్శించారు. గత నెలలో వారు పాఠశాల అభివృద్ధికి రూ.40లక్షల నిధులను విడుదల చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామంలో పాఠశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం రజితరెడ్డి దంపతులకు పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు.

పత్తి రైతులకు అన్యాయం



మహబూబాబాద్: విదేశీ పత్తి దిగుమతులపై గతంనుంచి కొనసాగుతూ వస్తున్న 11శాతం పన్నులను ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడంతో దేశంలో పత్తిసాగు చేస్తున్న 60లక్షల రైతు కుటుంబాలకు అన్యాయం జరిగిందని ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న చంద్రన్న, ఏఐకేఎస్ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు సుధాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం మానుకోట జిల్లా కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఐలయ్య, రాజన్న, కట్టన్న, యశోద, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా నాయకుడు ఓంకార్

తొర్రూరు: నిస్వార్థ ప్రజానాయకుడు మద్దికాయల ఓంకార్ అని ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి తెలిపారు. డివిజన్ కేంద్రంలో బుధవారం ఎంసీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఓంకార్ శత జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న తొర్రూరులో ఎంసీపీఐ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, నాయకులు మంద రవి, గుగులోతు అరుణ్‌నాయక్, శంకరాచారి, వెంకన్న, భూక్య బాలాజీ పాల్గొన్నారు.

పోరాటాలే శరణ్యం



నెల్లికుదురు సెంటర్: అంగన్‌వాడీ వ్యవస్థలు నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు మాత్రమే శరణ్యమని సీఐటీయూ నాయకుడు ఎస్.వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. వివిధ సంఘాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సీఐటీయూలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కుమ్మరి కుంట్ల నాగన్న, సమ్మెటరాజమౌళి, దుండి వీరన్న పాల్గొన్నారు.

నేడు లక్ష గరిక అర్చన పూజ

మహబూబాబాద్ రూరల్: లోక కల్యాణార్థం, కలికాలంలో కలిదోష నివారణార్థం మానుకోటలో గణపతికి లక్ష గరిక అర్చన పూజ గురువారం నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, రామారావు, శ్రీనివాస్, రాంబాబు, ప్రభాకర్ బుధవారం తెలిపారు.

గుంతలు ఇక్కడ.. అభివృద్ధి ఎక్కడ?

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కురవి: మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కురవి నుంచి మొగిలిచర్ల వెళ్లే మార్గంలో ముత్యాలమ్మ చెరువు వద్ద, మొగిలిచర్ల–డోర్నకల్ ప్రధాన రహదారిపై అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా, నల్లెల్ల నుంచి లింగ్యాతండా మార్గంలో, తిర్మలాపురం–టేకుల తండా మార్గంలో ఇలా చెప్పుకుంటు పోతే అనేక గ్రామాల్లోని రోడ్లపై గుంతలు ఏర్పడి ఇబ్బందిగా మారింది. మొగిలిచర్ల–డోర్నకల్ ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడడంతో నిత్యం ఆ మార్గంలో వాహనాలు వెళ్తుంటాయి. రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న గుంత కనిపించకుండా ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు రోడ్డుపై విరిగిన కుర్చీ, కర్రలను పెట్టారు. రాత్రి సమయంలో అవి కనిపించకుంటే గుంతలోకి వెళ్లి ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. నల్లెల్ల–లింగ్యా తండాకు వెళ్లే మార్గంలో చెరువు కట్టపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. గుంతలో పడి వాహనాలు చెరువులోకి, లేదా పొలాల్లో పడే అవకాశాలున్నాయి. గుంతలకు తోడు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుమ్మ చెట్లు అలుముకుని ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఉంది. తిర్మలాపురం–టేకుల తండా, అక్కడి నుంచి గాజ తండాకు వెళ్లే మార్గంలో సైతం ఇదే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.



మొగిలిచర్ల వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పెట్టిన కుర్చీ



నల్లెల్ల–లింగ్యాతండాకు వెళ్లే రోడ్డు ఇలా..

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

మరిపెడ రూరల్: తప్పుడు సమాచారం ఓ రైతులు ప్రాణం మీదకు వచ్చింది. యూరియా కూపన్లు ఇస్తున్నారని ఓ వ్యక్తికి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టగా అది తెలుసుకున్న రైతు త్వరగా వస్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈసంఘటన మండలంలోని పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని భూక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోడతండా వాట్సాప్ గ్రూప్‌లో ఓ వ్యక్తి రేపు యూరియా కూపన్లను రెవెన్యూ విలేజ్ అయిన ఉల్లెపల్లిలో ఇస్తున్నారని తప్పుడు సమాచారం పెట్టాడు. విషయాన్ని తెలుసుకున్న సదరు రైతు నర్సింగ్ బుధవారం తెల్లవారు జామున తన మోపెడ్ వాహనం ద్వారా బయలు దేరాడు. ఈక్రమంలో పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్ద వాహనం అదుపు తప్పి రైతు కింద పడ్డాడు. ఈ ఘటనలో రైతుకు తలకు, మొకానికి తీవ్రగాయలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అయోధ్య గ్రామ శివారు భజనతండా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ ఈఎంటీ బంగారి, పైలట్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన తేజావత్ వెంకన్న, మరొకరు కలిసి ఓ ద్విచక్రవాహనంపై వస్తున్నారు. భజన తండా దాటి వెళ్తుండగా ముడుపుగల్ గ్రామం వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో వెంకన్న కుడికాలు విరిగి తీవ్రగాయం కాగా 108లో జనరల్ ఆస్పత్రికి తరలించారు.

గంగారంలో ఒకరికి..

గంగారం: మండలంలోని చింతగూడెం గ్రామంలో ఓ పంక్షన్ వద్ద ఇంటి గోడ బుధవారం కూలింది. దీంతో బొల్లి సుధాకర్ అనే వ్యక్తికి కాలు విరిగింది. వెంటనే స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కురవి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని డీఈఓ దక్షిణామూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ ఆధ్వర్యంలో ఒడ్డెటి భాగ్యమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త రిటైర్డ్ పీడీ ఒడ్డెటి వెంకటయ్య, కుమార్తె ఒడ్డెటి ఝాన్సీ, అల్లుడు భిక్షపతి సహకారం అందజేయగా, యూనిఫాం, టీషర్టులను డీఈఓ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉప్పలయ్య, జిల్లాసైన్స్ అధికారి అప్పారావు, కురవి, సీరోలు ఎంఈఓ లచ్చిరాం నాయక్, ఫైనాన్స్ అండ్ ఆడిట్ ఆఫీసర్ బి.శంకర్, రామసహాయం శ్రీధర్‌రెడ్డి, దాతలు ఒడ్డేటి వెంకటయ్య, ఝాన్సీ, భిక్షపతి, మేకల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న డీఈఓ

సైన్స్, ఆర్ట్స్ నైపుణ్యాలు వెలికితీయాలి



ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఏసీజీఈ శ్రీరాములు

మహబూబాబాద్ రూరల్: విద్యార్థుల్లో దాగిఉన్న సైన్స్, ఆర్ట్స్ నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ ఇన్‌చార్జ్ (ఏసీజీఈ) మందుల శ్రీరాములు అన్నారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. క్రియేటివిటీ క్లబ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయలకు సైన్స్, పెయింటింగ్ గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యా శాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు, క్రియేటివ్ క్లబ్ కోఆర్డినేటర్ మల్లయ్య పాల్గొని పర్వతగిరి గ్రామంలో ప్రథమ్ సంస్థ నిర్వాహకులు మంచి అవకాశాన్ని కల్పించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైన్స్, ఆర్ట్ కార్యక్రమాలలో నైపుణ్య కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయలకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రశంసపత్రాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ స్రవంతి, క్రియేటివ్ క్లబ్ కోఆర్డినేటర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆమె విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విసునూర్ దొరల ఆగడాలను వ్యతిరేకిస్తూ దగాపడుతున్న పేద ప్రజలకు అండగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నడుం బిగించిందన్నారు. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దోలి సత్యనారాయణ



బయ్యారం: చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



కేసముద్రంలో..



మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో..



తొర్రూరులో..



మరిపెడలో..



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దవంగరలో..

ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్/గార్ల: నల్లబెల్లం, పటిక రవాణా చేస్తున్న ఆటోను అదుపులోకి తీసుకుని, ఆరు క్వింటాళ్ల (600 కిలోల) నల్లబెల్లం 50కిలోల పటిక స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి బుధవారం తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గార్ల మండలం ముల్కనూరు గ్రామ శివారులో నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లం, పటిక రవాణ చేస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామన్నారు. నల్లబెల్లం, పటిక పట్టివేత ఘటనలో గార్ల మండలం చిన్నకిష్టపురం గ్రామానికి చెందిన భూక్యకుమార్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అతడి వద్ద నుంచి ఒక ఆటో, ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక, ఐదు లీటర్ల నాటుసారాయి సీజ్ చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై అశోక్ కుమార్, సిబ్బంది మధు, రవి, రాజు, వెంకట నర్సయ్య, భవాని పాల్గొన్నారు.



పట్టుకున్న బెల్లం చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



తొర్రూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

తొర్రూరు: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య తెలిపారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనంలో టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎద్దు వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా ఇల్లందుల శ్రీనివాస్, కోశాధికారిగా తోట రమేష్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్‌క్లబ్ ప్రతినిధులు ప్రకాశం, రమణారెడ్డి, రేగూరి వెంకన్న, దామెర సరేష్, నవీన్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ఈమేరకు బుధవారం నవీన్‌ను కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి ఘనంగా సన్మానించారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే..

పెద్దవంగర: విద్యార్థుల్లో అంధ విశ్వాసాలను తొలగించి శాస్త్రీయ జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులేనని దొంట్టి వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను బుధవారం పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

మరిపెడ: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని ఉమెన్ డెవలప్ ప్రోగ్రాం మేనేజర్ లతాప్రతాప్ అన్నారు. మరిపెడలో బాలవికాస సంస్థ వార్షిక మహాసభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో గంధసిరి ఉపేంద్ర, జుజ్జూరి ఉపేంద్ర, కవిత, నీల, వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని పోలెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు రూ.6వేల విలువ చేసే ఐడీ కార్డులను అంబేడ్కర్ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, జనార్దన్‌రాజు, వెంకట్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

తొర్రూరు రూరల్: మండలంలోని 29గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓ మధు మాట్లాడుతూ.. సామాజిక తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు రుజువైతే సంబంధిత ఫీల్డ్, టెక్నికల్ అసిసెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి పర్యటనను ఖండించాలి

నెహ్రూసెంటర్: భారత ప్రభుత్వంతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేయడానికి ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ మూడు రోజులుగా భారత దేశంలో చేస్తున్న పర్యటనను తీవ్రంగా ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మంత్రి భారత్ పర్యటనను నిరసిస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నందగిరి వెంకటేశ్వర్లు, బండారి ఐలయ్య, గుగులోత్ సక్రు, చింతా వెంకన్న, బట్టు చైతన్య, బోనగిరి మధు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి ఆర్వోబీ నుంచి జ్యోతిరావుపూలే సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండటంతో, పైపులైన్‌లు ధ్వంసం కావడంతో తాగునీరు సరఫరా నిలిచిపోయిందని బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భుక్య వీరన్న, లచ్చయ్య, సులోచన, విజయ, శ్రీను, వహీద్‌పాషా, మహేందర్, నెహ్రూ, రమేష్ పాల్గొన్నారు.

బస్సు నిలిపివేతపై వివాదం

బయ్యారం: ఆర్టీసీ బస్సును నిలిపివేయ లేదని జరిగిన వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో నివాసం ఉండే ఓ మహిళా ఉపాధ్యాయురాలు ఇల్లెందుకు వెళ్లేందుకు బుధవారం మహబూబాబాద్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుకు చేయి అడ్డం పెట్టగా బస్సును డ్రైవర్ నిలుపుదల చేయలేదు. ఈ క్రమంలో ఆ మహిళా ఉపాధ్యాయురాలు మోటర్‌సైకిల్ పై ఎక్కించుకొని ఆమె భర్త బస్సును బయ్యారం వరకు వెంబడించారు. బయ్యారంలో బస్సు నిలిచిన తరువాత ఉపాధ్యాయురాలు భర్తకు ఆర్టీసీ డ్రైవర్ మధ్య వివాదం పెరిగిపోయింది. ఈక్రమంలో ఇరువురిపై కేసు నమోదు చేసుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కేసముద్రం: విద్యుత్ ప్రమాదాలపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ఏడీఈ ఎం.ఐలయ్య అన్నారు. బుధవారం కేసముద్రం మండలం ఇనుగుర్తి సెక్షన్ పరిధిలో గల కోరుకొండపల్లి, మహముద్‌పట్నం, తావుర్యాతండాజీపీలలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భూలోక్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీను, యశ్వంత్, వేణు, జామ్లా పాల్గొన్నారు.

లారీకి తప్పిన ప్రమాదం

గంగారం: బస్సును తప్పించబోయిన లారీ రోడ్డు దిగడంతో డ్రైవర్ చాకచక్యంగా లారీ నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని తిరుమలగండి– మడగూడెం ప్రమాదన రహదారి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండలంలోని తిరుమలగండి– మడగూడెం గ్రామాల మధ్య ఇసుక వాగు వద్ద అతివేగంగా లారీ వెళ్తోంది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు రావడంతో ఒక్కసారిగా లారీని కంట్రోల్ చేసి రోడ్డు కిందకి దింపడంతో ప్రమాదపు టంచున లారీ నిలిచిపోయింది. దీంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలందరు ఊపిరి పీల్చుకున్నారు.

మోకాళ్లపై నడుస్తూ నిరసన



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి చైతన్యనగర్‌కి చెందిన వల్లందాస్ సతీష్ అనే వ్యక్తి, ఎంపీడీఓ ఆఫీస్ మలుపు నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు మోకాళ్లపై బుధవారం నడిచి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి కులం జనాభాకు తగినట్లుగా అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ అయినా, 10సీట్లు ఇవ్వాలని అప్పుడే ఐలమ్మకు ఇచ్చే ఘన నివాళి అని ఆయన అన్నారు.

యూరియాపై సమన్వయ సమావేశం

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సమయానికి సరఫరా జరిగే విధ్యంగా చర్య తీసుకోవాలని తహసీల్దార్ చంద నరేష్, ఎస్సై చిర్ర రమేష్ బాబు వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో జరిగిన యూరియా సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు.

నష్టపరిహారం చెల్లించాలి

కేసముద్రం: ఆర్వోబీ నిర్మాణం, రోడ్డు విస్తరణలో ఇళ్లను, స్థలాలను కోల్పోయిన తమకు చెల్లించాలిసిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బుధవారం మున్సిపాలిటీ పరిధి ఎన్టీఆర్‌నగర్‌లోని ప్లెఓవర్ బ్రిడ్జి ప్రధాన రహదారిపై పలువురు బాధితులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బానోత్ శంకర్, బానోతు బద్యా నాయక్, బాదావత్ అమృ, రాజు, సంధ్య, అరుణ, కాంతమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఐదుగురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తున్న హరితవనాల ప్రాంతంలో అక్రమంగా భూమిని దున్నిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపారు. లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) గ్రామంలో ప్రభుత్వ స్థలంలో హరితవనాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో కొండపల్లి సీతారాములు, జానిమియా, సైదులు, భూక్య భావ్ సింగ్, సంగెపు నరేష్ ట్రాక్టరుతో దున్నుతున్నారని పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.


గార్లలో..

గార్ల: పంట కాలువల్లో దొరికిన 140 కల్తీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషాలు బుధవారం వెల్లడించారు. గార్ల మండలం పెద్దకిష్టాపురం పంచాయతీ సమీపంలో ముష్టికుంట పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు పడవేయడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అట్టి కల్తీ మద్యం 110ఐబీ క్వార్టర్లు, 30 రాయల్‌స్టాగ్ క్వార్టర్లను స్వాధీనం చేసున్నారు. కల్తీ మద్యం బాటిళ్లను పరీక్షలకు ల్యాబ్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెద్దవంగర: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాసాని ఐలయ్య (44) మంగళవారం జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి వ్యక్తిగత పనుల మీద ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో నర్సింగపురం గ్రామ శివారులో వ్యక్తిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయాలు కాగా అతన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు సంతోష్, కుమార్తె సమత ఉన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త మృతి



మహబూబాబాద్ రూరల్: ప్రముఖ వ్యాపారవేత్త పురుషోత్తం ఝువర్ (65) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జీకే కోల్డ్ స్టోరేజీ యజమానిగా, వ్యవసాయ మార్కెట్ వ్యాపారిగా పురుషోత్తం ఝువర్ పేరుగాంచారు.

దంత వైద్యులను నియమించాలి

నెహ్రూ సెంటర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో దంత వైద్యులను నియమించాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ అన్నారు. అసెంబ్లీ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. రోజు సుమారు రెండు వేలమంది రోగులు వచ్చే ఈ ఆస్పత్రిలో డెంటల్ వైద్యులు లేకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు గుగులోత్ నరేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు